ధాన్యం ధరపై భరోసా

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. రైతుభరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పెట్టుబడి సాయం, పంటనష్ట పరిహారం తదితర సంక్షేమ కార్యక్రమాల ద్వారా రైతులకు భరోసా ఇస్తోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం ధరలు తగ్గకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో కన్నా కొనుగోలు కేంద్రాల్లోనూ, మార్కెట్‌లోనూ ధాన్యం ధరలు బాగుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- కొనుగోలు కేంద్రాల్లో సరళతర నిబంధనలు
- ధర తగ్గకుండా ప్రభుత్వం చర్యలు
- ఆర్‌ఎన్‌ఆర్ 15048(షుగర్ లెస్) రకానికి రికార్డు ధర
- కోవూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఈ రకమే సాగు
- రైతుల్లో హర్షాతిరేకాలు


ధర సంతృప్తికరంగా ఉండడంతో ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

కొడవలూరు: ప్రస్తుతం ధాన్యం ధరలు అదరహో అంటున్నాయి. కోవూరు నియోజకవర్గంలో అత్యధికంగా సాగు చేసిన ఆర్‌ఎన్‌ఆర్–15048(షుగర్ లెస్) రకం ధాన్యం ధర అత్యధికంగా ఉంది. ఆ తరువాత ఎక్కువగా సాగు చేసిన బీపీటీ–5204 రకం పెద్ద జిలకర ధాన్యం ధర మెరుగ్గా ఉంది. ప్రభుత్వం ధాన్యం ధరలు క్షీణించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరళతర నిబంధనలు అమలు చేస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు తగ్గకుండా..

రబీలో ధాన్యం ధరలు తగ్గకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొత్త నిబంధనలు అమలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించే ధాన్యానికి మంచి ధర కల్పించడంతోపాటు అవినీతికి తావులేని నిబంధనలు అమలు చేస్తోంది. కేంద్రాల్లో ఏ–గ్రేడ్ పుట్టి ధర రూ.17,510, సాధారణ రకం పుట్టి ధర రూ.17,340లుగా ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా పొలం వద్దకే టెక్నికల్ అసిస్టెంట్ వెళ్లి నాణ్యత పరీక్షల నిమిత్తం నమూనాలు సేకరించేలా చర్యలు తీసుకుంది. అవినీతికి తావులేకుండా మొబైల్ యాప్‌లో నాణ్యతా ప్రమాణాలు, గోనె సంచులు, లేబర్, రవాణా నమోదు చేసి పొలం వద్దనే ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకుంది. మిల్లర్లు రైతులను మోసం చేయకుండా కంప్యూటర్ ద్వారా ఆటో జనరేట్ చేసిన మిల్లులకే రైతులు ధాన్యం తరలించేలా నిబంధనలు సవరించింది. తదుపరి రైతు ఖాతాలోనే ధాన్యం మద్దతు ధర, గోనె సంచులు, లేబర్, రవాణా చార్జీలను జమ చేసేలా చర్యలు తీసుకుంది. దీంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించేందుకు మక్కువ చూపుతున్నారు.

కోవూరు నియోజకవర్గంలో రబీలో వరి సాగు వివరాలు

మండలం	విస్తీర్ణం(ఎకరాల్లో..)
కొడవలూరు	20 వేలు
విడవలూరు	25 వేలు
కోవూరు	13 వేలు
ఇందుకూరుపేట	7 వేలు
బుచ్చిరెడ్డిపాళెం	10 వేలు

మార్కెట్ ధరలు కూడా..

కోవూరు నియోజకవర్గం పూర్తిగా డెల్టా ప్రాంతం కావడంతో రైతులు ప్రధానంగా వరి సాగు చేస్తున్నారు. రబీ పంట కాలంలో కోవూరు నియోజకవర్గంలో సుమారు 75 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించగా మార్కెట్‌లో కూడా ధాన్యం ధరలు బాగుండడంతో రైతులు లాభాలు పొందుతున్నారు. ఈ రబీలో నియోజకవర్గంలో అత్యధికంగా ఆర్‌ఎన్ఆర్–15048(షుగర్ లెస్) రకం వరి పంటను 35 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. గతేడాది ఈ రకం ధాన్యం ధర పుట్టి(860 కేజీలు) రూ.15,500 పలకగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.21 వేలు పలుకుతోంది. అలాగే నియోజకవర్గంలో 30 శాతం విస్తీర్ణంలో బీపీటీ–5204(పెద్ద జిలకర) రకం వరి సాగు చేశారు. గతేడాది రబీలో ఈ రకం ధాన్యం పుట్టి రూ.13,500 పలకగా, ప్రస్తుతం మార్కెట్‌లో పుట్టి ధర రూ.18,500 పలుకుతోంది. మరో 30 శాతం విస్తీర్ణంలో కేఎస్ఎం–1638 రకం వరి సాగు చేయగా, ఈ రకం ధాన్యం ధర కూడా మార్కెట్‌లో పుట్టి ధర రూ.18,500 పలుకుతోంది. మిగిలిన విస్తీర్ణంలో ఎంటీయూ–1010, కేఎస్ఎం–733 తదితర రకాలను సాగు చేశారు. అటు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర నిర్ణయించగా, మార్కెట్‌లో కూడా ధరలు బాగుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

సంతృప్తికరంగా ఉంది



ధాన్యం ధర ఎంతో సంతృప్తికరంగా ఉంది. 20 ఎకరాల్లో షుగర్‌లెస్ రకం సాగు చేశాను. దీని ధర ప్రస్తుత మార్కెట్‌లో పుట్టి రూ.21 వేలు ఉన్నందున లాభదాయకంగా ఉంది. మిగిలిన రకాల ధాన్యం ధరలు కూడా ఎంతో సంతృప్తికరంగా ఉన్నాయి.
– దేగా హరికిషన్, రైతు, గుండాలమ్మపాళెం

ధాన్యం ధరలు మెరుగ్గా..



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నూతన నిబంధనలు అమలు చేస్తోంది. ధాన్యం ధరలు మెరుగ్గా ఉన్నాయి. రైతులకు ఎలాంటి శ్రమ లేకుండా నిబంధనలు సరళతరం చేసింది. తద్వారా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపుతారు. అలాగే మార్కెట్‌లో కూడా ధాన్యం ధరలు బాగున్నాయి. ప్రభుత్వ నూతన నిబంధనలు రైతులకు ఎంతో మేలు కలిగిస్తున్నాయి.
– దేవనబోయిన శివకుమార్, రైతు, రేగడిచెలిక

మార్కెట్‌లో మంచి ధరలు



ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నూతన నిబంధనలు అమలు చేస్తోంది. ఈ నిబంధనల ప్రకారం రైతులకు ఎలాంటి శ్రమలేకుండా మంచి ధరలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొనే వెసులుబాటు కల్పించింది. ఈ ధరలు రైతులకు సంతృప్తికరంగా ఉన్నాయి.
– సీహెచ్ఎస్ లక్ష్మి, ఏఓ, కొడవలూరు

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శ్రీకృష్ణమందిరం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని అలగానిపాడులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని, అలాగే విగ్రహ ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమాలతోపాటు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా శివజయంతి వేడుకలు



ఇందుకూరుపేట: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివజయంతి వేడుకలు మండలంలోని మైపాడులో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆశ్రమ నిర్వాహకుడు వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా నారాయణరావు ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాహితం కోరుతూ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వహించే కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మైపాడులో ఆశ్రమం నిర్వహించి ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగిస్తోందని తెలిపారు. తొలుత సిస్టర్ ప్రసన్న, సిస్టర్ రాధిక హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు బాలకృష్ణ, మాధవ్, అనిల్, ఆశ్రమ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు విడవలూరులో జాబ్‌మేళా

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత ఆదివారం తెలిపారు. ఈ జాబ్‌మేళాను జవహర్ నాలెడ్జ్ సెంటర్, లలితా జ్యూయలరీ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, షోరూం మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9133848444 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



మనుబోలు: పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కొలనకుదురు గ్రామంలో ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ తూపిలి వెంకటరమణయ్య చేతులమీదుగా గిరిజన కుటుంబాలకు దుస్తులు అందజేశారు. వృద్ధులు, వితంతువులు 25 మంది, 30 మంది చిన్నారులకు దుస్తులు అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు పోతుగుంట మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరమణమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూడిపర్తిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాచలం: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పూడిపర్తి గ్రామంలో శివాజీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 104 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని తెలిపారు. ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలు తొలగిపోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్‌రావు, సర్పంచ్ దక్కలి శ్రావణి, ఎంపీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, హరి, సాయికిరణ్, శరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేళాంగిణి చర్చిలో ప్రార్థనలు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వద్ద ఉన్న వేళాంగిణి చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వేళాంగిణి చర్చి డైరెక్టర్, ఫాదర్ లోకేష్‌రాజ్ దైవసందేశం వినిపించారు. చర్చిలో జరిగిన ప్రార్థనలకు జిల్లా నలువైపుల నుంచి భక్తులు విచ్చేశారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

ఇందుకూరుపేట: కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి మండలంలోని నరసాపురం, మైపాడులలో ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాల తనిఖీ చేపట్టి సరైన పత్రాలు, లైసెన్సులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశారని ఫిర్యాదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తనను నమ్మించి మోసం చేసి గర్భస్రావం చేయించిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని దిశ పోలీస్‌స్టేషన్లో ఓ యువతి ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరుకు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన శ్రీహరి ప్రేమిస్తున్నానని నమ్మించారు. గర్భం దాల్చాక బలవంతంగా మాత్రలు ఇచ్చి గర్భస్రావం చేయించారు. వివాహం చేసుకునేందుకు నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు అభినందన


కొడవలూరు: విజయకుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

కొడవలూరు: ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన గొల్లపల్లి విజయకుమర్‌ను మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏపీ పశుగణాభివృద్ధి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ మందపల్లి మల్లికార్జున ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..

ఇందుకూరుపేట: ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన గొల్లపల్లి విజయ్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు దండిగుంట ఫణీంద్రనాయుడు ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కూలే దశలో అలనాటి భవనాలు


గోపాలపురంలోని సాల్ట్ కార్యాలయం


ముత్తుకూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహం

ముత్తుకూరు: మండలంలోని గోపాలపురంలో నూరేళ్ల నాటి సాల్ట్ డిప్యూటీ సూపరింటెండెంట్ కార్యాలయం శిథిలమై కూలిపోయే దశకు చేరింది. ఉప్పు ఉత్పత్తి నిలిచిపోవడం, ఇక్కడ పనిచేసే ఉద్యోగులు క్రమంగా ఉద్యోగ విరమణ చేయడంతో ఈ కార్యాలయం బోసిపోయింది. గోడలకు పెచ్చులూడి, పైభాగంలో పెంకులూడి, కలపకు చెదలు పట్టడంతో ఈ భవనం పూర్వవైభవం కోల్పోయింది. చీమలు, పాముల పుట్టలకు నెలవుగా మారింది. ఈ కార్యాలయానికి వెళ్లే దారి కూడా ముళ్లచెట్లతో మూసుకుపోయింది. ముత్తుకూరులో తెల్లదొరల కాలంనాటి ఆర్అండ్‌బీ అతిథిగృహం కూడా పూర్తిగా శిథిలమైపోయింది. కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. తెల్లదొరలు ఇక్కడ జమాబందీ నిర్వహించేవారని ప్రతీతి. క్రమంగా శిథిలమై, పూర్వవైభవం కోల్పోయింది.

పీఎంపీలు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కవితా కిరణ్

నెల్లూరు(అర్బన్): మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు గానూ గ్రామీణ స్థాయిలో పీఎంపీలు అవగాహన కల్పించాలని డాక్టర్ కవితా కిరణ్ పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, ఆధునిక వైద్యం, సంతాన సాఫల్యం, తదితర అంశాలపై పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులకు అవగాహన సదస్సును పొగతోటలోని సాయికిరణ్ మెటర్నిటీ ఫెర్టిలిటీ హాస్పిటల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒత్తిడి, నిద్రలేమి, తదితర కారణాలతో సంతాన సమస్యలు ఎక్కువవుతున్నాయని చెప్పారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను నిర్వహించి బుక్‌లెట్లను ఆవిష్కరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ రాణి, ఎంబ్రియాలజిస్ట్ రామాంజనేయులు, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సత్తార్, నేతలు ప్రసాద్, శ్రీనివాసులు, రామదాస్, రమణయ్య, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య సలహాలు ఇస్తున్న డాక్టర్

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక వివేకానంద పాఠశాలలో ఆదివారం బాలా హార్ట్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు బాలకృష్ణ మాలేపాటి మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసిన పేదలకు వైద్యసలహాలతోపాటు మందులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో బుచ్చిరెడ్డిపాళెం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు 450 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఈసీజీ కూడా తీశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాలిరెడ్డి, హారిక, సి.వినోద్‌కుమార్‌రెడ్డి, ఎం.శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి



బుచ్చిరెడ్డిపాళెం: అనాథలకు, పేదలకు, వృద్ధుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని రేబాల సర్పంచ్ లగుంతోటి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రేబాలలో ఉన్న వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు పాశం కుమారి, గుమ్మడి స్వరాజ్యం, చేజర్ల అచ్యుత, చేజర్ల మౌనిక, ఎల్లంటి మహిత, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మస్తానయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించామని సంఘ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి తొమ్మిది నుంచి నిర్వహించనున్న ఆందోళనల్లో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

దాతల సహకారంతో ఆలయాల అభివృద్ధి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


వంశీధర్‌రెడ్డిని అభినందిస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం అవసరమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇనమడుగు పంచాయతీ పరిధిలో ఉన్న జమ్మిపాళెంలో ఉన్న మాతమ్మ ఆలయాన్ని దాదాపు రూ.4 లక్షలతో ఇనమడుగు గ్రామానికి చెందిన మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి కుటుంబసభ్యులు అభివృద్ధి చేశారని తెలిపారు. అందుకు సంబంధించిన పలు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. వంశీధర్‌రెడ్డి అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్నప్పటికీ సొంత గ్రామంపై మమకారం చూపడం అభినందనీయమన్నారు. అనంతరం డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడారు. అలాగే పడుగుపాడు చంద్రమౌళినగర్ గిరిజనకాలనీలో వలంటీర్‌గా పనిచేస్తున్న పెంచలయ్యకు రూ.35 వేల విలువ చేసే త్రిచక్ర వాహనాన్ని నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, బాలకృష్ణారెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, సర్పంచ్ ప్రమీలమ్మ, నాయకులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడా పోటీల్లో సాధించిన పతకాలతో విద్యార్థులు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఏస్సార్ జెడ్పీ హైస్కూల్లో సర్వేపల్లి జోన్ పరిధిలో నిర్వహించిన గ్రిగ్స్ మెమోరియల్ క్రీడా పోటీల్లో అమ్మవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 8 పతకాలను సాధించి సత్తాచాటారు. బాలికల విభాగంలో కబడ్డీ, త్రోబాల్‌లో ప్రథమస్థానం, టెన్నికాయిట్‌లో ద్వితీయస్థానం సాధించారు. బాలుర విభాగంలో సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచారు. జూనియర్ బాలుర విభాగంలో ఫుట్‌బాల్ ద్వితీయస్థానం సాధించినట్లు పాఠశాల పీడీ సురేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్ఎం విజయకుమార్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, వెంకటరెడ్డి, శ్రీహరిరెడ్డి, గౌస్, రామరాఘవయ్య పాల్గొన్నారు.

కోడూరు బీచ్‌లో సందడి


బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సాధారణంగా సెలవు, పండగ రోజుల్లో సరదాగా గడిపేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు పర్యాటకులు విచ్చేస్తుంటారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో కోడూరు బీచ్ సందడిగా మారింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులు బీచ్‌లో సేదతీరారు. అలాగే స్నేహితులతో కలిసి వచ్చిన యువతీ యువకులు గంటల కొద్ది సముద్రస్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులు బీచ్‌లో సందడి చేశారు.